## క్లుప్తంగా

### చంద్రగిరిలో దసరా వేడుకలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని దస్తగిరిపేట్ (చంద్రగిరి)లో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్ 2న దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు పురంధరాచార్య శుక్రవార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 5:40 గంటలకు అశ్వవాహన సేవ, శమీపూజ, కార్తీక దీపారాధన, మహా మంగళహారతి ఉంటాయని పేర్కొన్నారు.

### చంద్రవంచలో మహబూబ్ సాబ్ దర్గా ఉత్సవాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గేటు వద్ద మహబూబ్‌సాబ్ దర్గా ఉత్సవాలు అక్టోబర్ 3న ప్రారంభిస్తారని గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి, పటేల్ రవిశంకర్, సరోత్తంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తేదీ శుక్రవారం గంధం, శనివారం జాతర నిర్వహిస్తారని తెలిపారు.

### మైనార్టీల సమస్యలపై దృష్టి సారించాలి

యాలాల: తాండూరు నియోజకవర్గంలో మైనార్టీల సమస్యలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టి సారించాలని మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూరు శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యేతో సమస్యలపై చర్చించడానికి అవకాశం కల్పించాలని వారు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తాండూరు ఇన్‌చార్జి సాదిఖ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదర్, యూత్ అధ్యక్షుడు యాసర్, మండల అధ్యక్షుడు మగ్దూం, ఇస్మాయిల్ ఫర్హాత్, వాసే తదితరులు ఉన్నారు.

### దేశాన్ని పూర్వ స్థితికి తీసుకురావడమే లక్ష్యం



ధారూరు: మాట్లాడుతున్న సుందర్‌రెడ్డి

ధారూరు: దేశాన్ని పూర్వ స్థితికి తీసుకరావడమే సంఘ్ అంతిమ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సంఘ్ చాలక్ సుందర్‌రెడ్డి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ధారూరులో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఎక్కడ విపత్తులు జరిగిన సంఘ్ స్వయం సేవకులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యాక్రమంలో మాజీ సర్పంచు చంద్రమౌళి, స్వయం సేవకులు పాల్గొన్నారు.

**దోమలో..**



ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న జిల్లా ప్రభోధన్ కృష్ణయ్య

దోమ: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో జిల్లా ప్రభోధన్ వక్త కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థగా ఆర్‌ఎస్‌ఎస్ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

### బీజేపీ బూత్‌స్థాయి సమావేశాలు



సమావేశంలో బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్లలో బీజేపీ నాయకులు బూత్ స్థాయి సమావేశాలు ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు జగదీశ్‌సాగర్, మాజీ అధ్యక్షుడు నర్సింలు, నాయకులు బాబయ్య నాయుడు, రాజు నాయక్, అనిల్, జనార్దన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

కొడంగల్ రూరల్: విరాసత్ చేయడంలో జాప్యం చేస్తున్నందుకు నిరసనగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 4వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) జిల్లా సభ్యులు కొత్తురు అంజిలప్ప, కొడంగల్ మండల అధ్యక్షుడు ఇందనూర్ అంజి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసనలు వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన పోసగాళ్ల నర్సప్ప కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఎంపీపీ, జెడ్పీటీసీ బీసీ మహిళకే!




- జనరల్ అభ్యర్థుల ఆశలు ఆవిరి
- దుద్యాల్‌లో ఒకే రిజర్వేషన్ కేటాయింపుపై చర్చ
- ఇదే ఫైనల్ అంటున్న మండల వాసులు
- జెడ్పీటీసీగా గెలిస్తే చైర్మన్ అయ్యే ఛాన్స్

దుద్యాల్: దుద్యాల్ నూతన మండలం కావడంతో అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన రాజకీయ నాయకులు, తమ వర్గానికి సీటు కేటాయిస్తే ఎవరికి వారే పోటీలో ఉంటామని భావించారు. కానీ కొత్తగా ఏర్పడిన మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు రెండు కూడా బీసీ–మహిళకు కేటాయించడంతో ఇతర సామాజిక వర్గానికి చెందిన ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, జనరల్ అభ్యర్థులు రాజకీయంగా, ఆర్థికంగా బలంగానే ఉన్నారు. ఏదైన ఒక్కటి బీసీ జనరల్ వస్తోందని, ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయిస్తారని కొందరు లెక్కలు వేసుకున్నారు. కానీ అవేవీ రిజర్వ్ కాలేదు. ఇది ఎలా జరిగిందని ఇంకొందరు తలలు పట్టుకుంటున్నారు. మా సామాజిక వర్గానికి వస్తుందనుకుంటే, ఇంకో వర్గానికి వెళ్లిందని ఎస్టీ, జనరల్ ఆశావహులు నిరాశలో పడిన్నట్లు సమాచారం. అయిన కేటాయించిన సీట్ల విషయంలో చాలా మంది అసంతృప్తిగా ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు పునరాలోచించాలనే సంకేతాలు పంపుతున్నట్లు తెలుస్తోంది.

**గెలిస్తే జిల్లా పరిషత్ చైర్మన్..**

వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి బీసీ–జనరల్ కావడంతో దుద్యాల్ మండల అభ్యర్థికి సైతం జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎందుకంటే దుద్యాల్, దోమ, మర్పల్లి మండలాలకు బీసీ–మహిళా రిజర్వేషన్ కేటాయించారు. యాలాలా, ధారూర్, బంట్వారం, బషీరాబాద్, కుల్కచర్ల మండలాలకు బీసీ–జనరల్ కేటాయించారు. కావున జిల్లా వ్యాప్తంగా అధిక స్థానాలు కాంగ్రెస్ గెలిస్తే, అధిక మెజార్టీ ఏ మండల జెడ్పీటీసీ సాధిస్తే ఆ మండలానికే అవకాశం ఉంటుంది. దుద్యాల్ మండల జెడ్పీటీసీ అభ్యర్థి అధిక మోజార్టీ సాధిస్తే జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని బహిరంగంగానే చర్చ జరుగుతుంది.

**అంచనా తారుమారు**



కొన్ని సంవత్సరాలుగా పార్టీకి సేవ చేస్తున్నాం. మండలంలో కొత్తగా ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఏర్పడ్డాయి. ఏదైన ఒకటి ఎస్టీ రిజర్వేషన్ కాకపోతుందా అని భావించాం. కానీ రిజర్వు కాలేదు. మా అంచనాలు తారు మారయ్యాయి. రెండు స్థానాలు కూడా బీసీ–మహిళలకే వరించాయి. రాజకీయంగా మండలంలో ఎస్టీలకు నిరాశే మిగిలింది. మండలంలో ఏడు తండాలు, గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ ఒక్కసీటు రిజర్వు కాలేదు.

– నేనావత్ రవి నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు

# వైద్య శిబిరాలకు విశేషస్పందన

ముగిసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చిందని వైద్యులు డాక్టర్ వందన పేర్కొన్నారు. మంగళవారం దంత సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో 19, 23, 26, 30 తేదీలలో నిర్వహించిన వైద్యశిబిరాల్లో ప్రత్యే పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారన్నారు. అన్ని రకాల వైద్య శిబిరాలకు ప్రజల నుంచి స్పందన లభించిందన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ ప్రియాంక, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సౌమ్యరాణి, సూపర్‌వైజర్ వజ్రమాళ, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమావేశానికి రావాలని ఎమ్మెల్యేకు పిలుపు

- బీఆర్‌ఎస్ కార్యకర్తల మీటింగ్‌లో సీటు కేటాయింపు
- హాజరుకాని ఎమ్మెల్యే కాలె యాదయ్య



సమావేశంలో ఎమ్మెల్యేకు రిజర్వు చేసిన కుర్చీ

నవాబుపేట: లక్ష్మారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కోసం సీటు రిజర్వు చేశారు. సమావేశం ప్రారంభం కాగానే వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, నాగేందర్‌గౌడ్‌లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అని ఒక కవర్‌పై రాసి సీటు రిజర్వు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే యాదయ్య తను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నట్లు ప్రకటించడంతో మంగళవారం సమావేశానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా కుర్చీ కూడా కేటాయించారని వివరించారు. ఆయన బీఆర్‌ఎస్ నుంచి ఫిరాయించింది కాక, పదవిపోతుందనే భయంతో బీఆర్‌ఎస్‌లో ఉన్నట్లు చెప్పుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

# పంట నష్ట పరిహారం చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బంట్వారం: భారీ వర్షాలకు పత్తి, పసుపు, కంది పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ మహేశ్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బంట్వారం, నూరుల్లాపూర్, యాచారం, నాగవరం, మాలసోమారం, సుల్తాన్‌పూర్‌లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. నూరుల్లాపూర్ వాగు వద్ద పొలాలు కోతకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్‌కు చెందిన పాలి హౌస్ కుప్పకూలిందన్నారు. డ్రిప్ పైపులు, మోటారు వరదలో కొట్టుకుపోయాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

# అమల్లోకి ఎలక్షన్ కోడ్

ప్రజాపాలన సర్వే పత్రాల తొలగింపు



దుద్యాల్: హస్నాబాద్‌లో ఇంటి తలుపునకు అంటించిన పత్రాన్ని తొలగిస్తున్న సిబ్బంది

దుద్యాల్: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిందని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగానే పార్టీలకు సంబంధించిన గుర్తులను, జెండాలను తొలగించే పనిలో నిమజ్ఞమయ్యారు. మంగళవారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వానికి సంబంధించిన జెండాలను, ఇతర ఆనవాల్లను తొలగిస్తున్నారు. ఇటీవల ప్రజాపాలన పేరుతో ఇంటింటికి సర్వే చేపట్టేందుకు ఇంటి గుమ్మానికి అంటించిన పత్రాలను కూడా తీసివేస్తున్నారు.

**కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఎంపీడీఓ కరీం**

పరిగి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ కరీం హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రావడంతో మంగళవారం ఆయ గ్రామాల్లోని ఫ్లెక్సీలు, పార్టీ సూచిక బోర్డులను ఇతరత్రాలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. కోడ్‌కు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడ ఎలాంటి గుర్తులు ఉన్నా వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.



పూడూరు: కంకల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

### కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



ధారూరు: దుర్గామత అవతారంలో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన ఆయా మండపాల వద్ద, మండలాల్లోని ఆలయాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులు అమ్మవారి పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. నిర్వాహకులు ఆయా మండపాల వద్ద ప్రత్యేపూజలు నిర్వహిస్తూ తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.



మర్పల్లి: బూచన్‌పల్లి దుర్గామాత అలంకరణలో..



తాండూరు రూరల్: అంతారంలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అనంతగిరి: వికారాబాద్‌లో మాజీ మంత్రి ఏసీఆర్ నివాసంలో బతుకమ్మ సంబురాల్లో కుటుంబీకులు



పూడూరు: మంచన్‌పల్లిలో దుర్గామాత వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

### ఘనంగా సద్దుల బతుకమ్మ

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో తొమ్మిదిరోజుల పాటు పూజలు నిర్వహించి ఆటపాటలతో ప్రతిరోజు పండగలా నిర్వహించారు. మంగళవారం సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. మహిళలందరు ఒకచోట కలిసి బతుకమ్మను ఉంచి పూజల నంతరం ఆడిపాడారు. చివరగా నిమజ్జనం చేసి వేడుకలను ముగించారు.



దుద్యాల్: బతుకమ్మలతో దుర్గామాత మండపం ముందు మహిళల సంబురాలు



బొంరాస్‌పేట: బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



యాలాల: ఐకేపీ ఆధ్వర్యంలో..



అనంతగిరి: ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి



తాండూరు రూరల్: అంతారంలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



తాండూరు: పట్టణంలోని సాయిపూర్‌లో సంబరాలు

# రుణాలు సకాలంలో చెల్లించండి

– పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి



నవాబుపేట: మాట్లాడుతున్న రాంరెడ్డి

నవాబుపేట: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండా అంశాలను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నష్ట వివరాలను వ్యవసాయ అధికారుల ద్వారా తీసుకొని తీర్మాణం చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించని ఎడలా వడ్డీ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లారెడ్డి, మల్లేశం, విఠల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్, ప్రభు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

**పీఏసీఎస్‌లో సీఎస్‌సీ సెంటర్ ప్రారంభం..**

ధారూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో మంగళవారం కామన్ సర్వీస్ సెంటర్‌ను చైర్మన్ వై. సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. సంఘంలో రుణాలు తీసుకునే రైతులకు కావాల్సిన అన్ని పత్రాలు ఇక్కడ లభిస్తాయన్నారు. ఇకనుంచి రైతులు మీసేవ కేంద్రానికి, ఇతర ప్రైవేట్ సీఎస్‌సీ సెంటర్లకు తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ముందుగా చైర్మన్ తన పొలం పహాణి పేపర్లు తీయించి డబ్బులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్, గఫార్, గోపాల్‌రెడ్డి, కరీం తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రూ.26.36 కోట్లు స్వల్ప, దీర్ఘ కాలిక రుణాలు వసూలు కావాల్సి ఉందని చైర్మన్ సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రైతు మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాలపై రూ.3.93 కోట్లు అప్పులు ఇచ్చినట్లు తెలిపారు. సంఘంలో 7,325 మంది రైతులున్నారని, స్వల్పకాలిక అప్పులు రూ.16.39 కోట్లు, దీర్ఘకాలిక అప్పులు 11.25 వసూలు చేయాల్సి ఉందని ఆయన వివరించారు. ఈ సంవత్సరం రూ.1.21 కోట్ల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నర్సింహులు,జిల్లా మేనేజర్ శ్రీనివాస్ డైరెక్టర్లు టి. గోపాల్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, గఫార్, అబ్దుల్ కరీం, సిబ్బంది తదితులు పాల్గొన్నారు.



ధారూరు: పీఏసీఎస్‌లో సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణరెడ్డి